సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 13 । ఆగస్టు । 2023



అభాగ్యులపై వాత్సల్యం

'వాత్సల్య' పథకాన్ని గద్వాల బాలసదన్ సమర్థవంతంగా అమలు చేస్తోంది.

వివరాలు 8లో ▸



గండి పూడ్చివేత

చిన్నోనిపల్లి రిజర్వాయర్ కట్ట గండి పూడ్చే పనులు పునఃప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.8 /22.2

వాతావరణం

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

నిర్వాసితులపై కేసులు ఎత్తేయాలి

గద్వాల అర్బన్: చిన్నొనిపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆందోళన చేసిన నిర్వాసిత రైతులపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఒక ప్రకటనలో ఖండించారు. రిజర్వాయర్ పనులు సజావుగా జరిగేందుకు సహకరించాలని అధికారులు అప్పట్లో రైతులకు కోరితే రైతులకు అందుకు సహకరించారని, కానీ పోలీసులు రైతులను మభ్యపెట్టి కేసులు నమోదు చేయడం సరికాదని తెలిపారు. రిజర్వాయర్ కోసం అన్ని కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న రైతులను కేసుల పేరుతో పోలీసులు మళ్లీ ఇబ్బందులకు గురి చేస్తూ విచారణ పేరుతో రైతులను పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడం ఆభ్యంతరకరమని తెలిపారు. వెంటనే నిర్వాసితులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు.

ఉత్తమ లైబ్రేరియన్‌గా రామాంజనేయులు



గద్వాల అర్బన్: ఉత్తమ లైబ్రరియన్‌గా రామాంజనేయులు ఎంపికయ్యారు. గ్రంథాలయ అధికారిగా ఉత్తమ సేవలందించడంతో రామాంజనేయులుకు శనివారం రంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాష్ట్ర స్థాయి అవార్డును అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జోరందుకుంటున్నాయ్..

- 230 మద్యం దుకాణాలకు 1,026 టెండర్లు

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం దుకాణాలకు టెండర్ల జాతర మొదలైంది. ఉమ్మడి జిల్లాలోని 230 మద్యం దుకాణాలకు క్రమంగా దరఖాస్తులు జోరందుకుంటున్నాయి. టెండర్ దాఖలు చేయడానికి గడువు సమీపిస్తుండటంతో మద్యం వ్యాపారులు పోటీ పడుతున్నారు. పాత మద్యం వ్యాపారులతోపాటు ఈసారి కొత్త వారు సైతం రంగంలోకి దిగుతున్నారు. రాబోయే రెండేళ్ల ఎన్నికల సమయం కావడంతో చాలామంది తమ భవిష్యత్ పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో శనివారం 322 టెండర్లు దాఖలయ్యాయి. ఇందులో మహబూబ్‌నగర్‌లో 200, నాగర్‌కర్నూల్‌లో 52, గద్వాలలో 61, వనపర్తిలో 9 టెండర్లు వచ్చాయి. ఇక ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 1,026 దరఖాస్తులు రాగా.. వీటిలో మహబూబ్‌నగర్, నారాయణపేట కలిపి 552, నాగర్‌కర్నూల్ 205, గద్వాల 166, వనపర్తివి 103 దరఖాస్తులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో వచ్చిన టెండర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.20.52 కోట్ల ఆదాయం సమకూరింది.

'పాలమూరు' పూర్తయితే రైతులకు మేలు

గోపాల్‌పేట: ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానికి ముందే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి పాలమూరు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలన్న లక్ష్యం ఉండేదని.. అందుకు అనుగుణంగానే నేడు ఉమ్మడి జిల్లా రైతుల సాగునీటి కష్టాలు తీరుస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లాలోని ఏదుల వీరాంజనేయ రిజర్వాయర్ వద్ద రైతన్నల సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైతులను ప్రాజెక్టు చూసేందుకు ఆహ్వానించారు. అనంతరం ప్రాజెక్టులో నిర్వహించిన రైతుల సంబురాలు సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లాలోని పది లక్షల ఎకరాలు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లోని 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునేందుకు ఎంతో మంది కోర్టులను ఆశ్రయించారని.. వాటన్నింటిని దాటుకుని నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎవరికీ నష్టం వాటిల్లకుండా పరిహారం అందించామన్నారు. ప్రస్తుతం 80 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని.. త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేస్తామని వివరించారు. ప్రాజెక్టులో 90 టీఎంసీల నీటి నిల్వ ఉంటుందని.. ఒక్కసారి నిల్వ చేస్తే భూగర్భ జలాలు పెరిగి ఉబికి వస్తాయని, సుమారు రెండేళ్ల పాటు సాగునీటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. గత పాలకులు పాలమూరును ఎడారి చేస్తే సీఎం కేసీఆర్ వచ్చిదనంతో నింపారని కొనియాడారు. నీరు, వైద్యం, విద్య, విద్యుత్ ఇలా అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. అనంతరం 250 మంది బీఆర్ఎస్‌లో చేరారు.

కొత్త రైల్వేలైన్‌పై ఆశలు





- గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా నల్లగొండ, సూర్యాపేట, డోర్నకల్‌కు
- ఫైనల్ లొకేషన్ సర్వేకు కేంద్ర రైల్వే బోర్డు నిర్ణయం
- 296 కి.మీ., పొడవైన ఎఫ్ఎల్ఎస్‌కు రూ.7.40 కోట్లు విడుదల
- తీరనున్న ఉమ్మడి జిల్లావాసుల చిరకాల కోరిక

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం రైల్వేరంగం అభివృద్ధిపై దృష్టిసారించడంతో కొత్త రైల్వేలైన్లపై ఆశలు చిగురిస్తున్నాయి. గద్వాల– డోర్నకల్ (మహబూబాబాద్) మధ్య రైల్వే లైన్ సర్వే కోసం ఆదేశాలు జారీ కావడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కావడం పట్ల జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరబోతోంది. దీనికి సంబంధించి ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్)కు కేంద్ర ప్రభుత్వం రూ.7.40 కోట్లు విడుదల చేసింది. దీంతో 296 కి.మీ., పొడవైన గద్వాల నుంచి వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట మీదుగా డోర్నకల్ వరకు రైల్వే లైన్‌కు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేల అనంతరం ఇచ్చే నివేదిక ఆధారంగా ఆ మార్గంలో కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది. తాజాగా విడుదలైన నిధులతో రైల్వేలైన్‌కు సంబంధించిన సర్వే పనులు త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ మేరకు గత నెల 26న కేంద్ర రైల్వేబోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ప్రాజెక్టుల్లో మౌలిక వసతులు, డబ్లింగ్, మల్టీ ట్రాకింగ్ తదితర పనులకు అనుమతులు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఆ జిల్లాలకు సౌకర్యం..

ఇప్పటి వరకు రైల్వేలైన్ కనెక్టివిటీ లేని వనపర్తి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట జిల్లాలకు రైల్వే సౌకర్యం కలుగుతుంది. వెనకబడిన ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందడానికి దోహదపడుతుంది. ఈ రైల్వేలైన్ ఏర్పాటైతే కాజీపేట– విజయవాడ, సికింద్రాబాద్– గుంటూరు, సికింద్రాబాద్– కర్నూలు మూడు రైల్వేలైన్ మధ్య కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇప్పటికే గద్వాల– రాయచూర్, డోర్నకల్– మణుగూర్ (మహబూబాబాద్) మధ్య రైల్వే లైన్లు ఉన్నాయి. కొత్తరైలు మార్గం అందుబాటులోకి వస్తే తెలంగాణలోని తూర్పు నుంచి పడమరకు ప్రయాణించడం సులభమవుతుంది. అలాగే బెంగళూరు నుంచి విశాఖపట్టణం, భువనేశ్వర్, కలకత్తా రైలు మార్గంలో సుమారుగా 200 కి.మీ., దూరం తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే గద్వాల, డోర్నకల్ రైల్వేస్టేషన్లు జంక్షన్లు కాగా.. కొత్తగా నల్లగొండ రైల్వేస్టేషన్ సైతం జంక్షన్‌గా మారుతుంది. రైల్వేలైన్, మామిడి క్లస్టర్, జాతీయ రహదారితో జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందనుంది.

1981 సంవత్సరంలోనే బీజం



గతంలో ప్రతిపాదించిన మాచర్ల– గద్వాల రైల్వేలైన్ కాకుండా కొత్తగా గద్వాల– డోర్నకల్ రైలు మార్గం తెరపైకి వచ్చింది. రాయచూర్, గద్వాల– మాచర్ల (గుంటూరు జిల్లా) రైల్వేలైన్ ప్రతిపాదన నిజాం కాలం నుంచి కొనసాగుతుంది. ఇందుకోసం మూడు సార్లు సర్వే కూడా చేశారు. రాయచూరు– మాచర్ల రైలు మార్గం ఆవశ్యకతను వివరిస్తూ.. 1981లో అప్పటి ఎంపీ మల్లు అనంతరాములు కేంద్రానికి ప్రతిపాదించారు. అప్పట్లో 184.2 కి.మీ., రైల్వేలైన్ కోసం రూ.919 కోట్లు కేటాయించారు. 2002లో రాయచూర్– గద్వాల రైలు మార్గానికి శంకుస్థాపన చేయగా చివరికి గద్వాలకే పరిమితమైంది. మరుగున పడిన రైల్వే అంశం 2007లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను మరోసారి కేంద్రానికి పంపించారు. 2015లో కేంద్రం సర్వేకు రూ.20 కోట్లు కేటాయించింది. పీపీపీ మోడ్‌లో (పబ్లిక్, ప్రైవేట్ పార్టిసిపేషన్) కొత్త లైన్‌ను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించినా.. సగం, సగం నిధులు ఖర్చు చేసే విషయం తేలకపోవడంతో రైల్వేలైన్‌కు అడుగులు పడలేదు. ఇప్పుడు అలైన్‌మెంట్ మార్చి సర్వేకు ఆదేశించడంతో ఈసారైనా రైల్వేలైన్ ఏర్పాటయ్యేనా అనే చర్చ జరుగుతోంది.

పరిశ్రమలు, ఉపాధి మెరుగు..



రైల్వేలైన్ నిర్మాణం పనులు చేపడితే ఉపాధి, ఉద్యోగావకాశాలు, పరిశ్రమల స్థాపన, వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. గద్వాల– మాచార్ల రైల్వేలైన్ ఆవశ్యకత గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించడమే కాకుండా రైల్వే మంత్రికి వినతిపత్రం సైతం అందజేశాం. కానీ సాధ్యం కాలేదు. కనెక్టివిటీల ప్రకారం అలైన్‌మెంట్ మార్చి కొత్త రైలు మార్గం సర్వేకు ఆదేశించారు. ఈ రైలు మార్గంలో తెలంగాణలో ఈ చివరి నుంచి ఆ చివరి వరకు వెళ్లేందుకు మార్గం సుగమమవుతోంది. ఈ రైల్వేలైన్ ఏర్పాటైతే ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయి. వేగంగా అభివృద్ధి చెందుతుంది.

– రాములు, ఎంపీ, నాగర్‌కర్నూల్

కేంద్రం కృషి వల్లే..



రైల్వే మార్గం జిల్లా ప్రజల చిరకాల కోరిక. కేంద్ర ప్రభుత్వం సర్వే కోసం నిధులు కేటాయించడం హర్షించదగిన విషయం. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణ చేస్తే ఈ రైల్వేలైన్ వేగవంతం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. రోడ్డు మార్గంలో వెళ్తే 417 కి.మీ., కాగా.. రైల్వేలో 296 కి.మీ., మాత్రమే. మైసూరు, కలకత్తా, విశాఖపట్టణం మధ్య రవాణా సౌకర్యం, రాయలసీమ నుంచి కోస్తాంధ్రకు కనెక్టివిటీ పెరగడం, గూడ్స్ రైళ్లు వచ్చే అవకాశం ఉంది. దీంతో సరుకు రవాణా పెరిగి.. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు ఇతర ప్రాంతాల్లో అమ్ముకునే అవకాశం లభిస్తుంది.

– సుధాకర్‌రెడ్డి, రైల్వేలైన్ సాధన సమితి చైర్మన్, నాగర్‌కర్నూల్

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. శనివారం మొదటగా జెడ్పీచైర్‌పర్సన్‌కు ఆలయ ఈఓ, అర్చకులు, నాయకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మద్దిలేటి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సప్తాహ భజనలు ప్రారంభం

ఆలయంలో సప్తాహ భజనలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు జడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, విక్రంసింహారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు నిర్వహించి భజన కార్యక్రమంను ప్రారంభించారు.

నేడు సీఆర్టీలకు కౌన్సెలింగ్

గద్వాల: కేజీబీవీ, యూఆర్ఎస్ విద్యాలయాలలో పోస్టులకు సంబంధించిన సీఆర్టీ, పీజీసీఆర్‌టీలకు 13వ తేదీ ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉందని డీఈఓ సిరాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన అభ్యర్థుల వివరాలను 1:1 నిష్పత్తిలో కార్యాలయంలో ఉంచడం జరిగిందని, అభ్యర్థులు విధిగా హాజరు కావాలని సూచించారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- 37 మంది చేనేత కార్మికులకు ప్రశంసా పత్రాలు
- చేనేత వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ, ప్రతిజ్ఞ



చేనేత ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: చేనేత రంగంలో తెలంగాణ.. దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఎక్కడా లేని విధంగా ఈ రంగంలోని ప్రతి ఒక్కరి సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. చేనేత వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. కరోనా కష్టకాలంలో నేతన్నకు చేయూత పొదుపు పథకం అండగా నిలిచిందన్నారు. గద్వాల జరీ చీరలు ఖండాంతర ఖ్యాతిని పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. చేనేత అందాలు మన సంస్కృతికి చిహ్నాలన్నారు. వారసత్వంగా వచ్చిన చేనేతను కాపాడుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత రంగం అభ్యున్నతికి గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించిందని చెప్పారు. చేనేత కార్మికులకు వచ్చే అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రలను ధరించి చేనేత రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని నేతన్నలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించి తోడ్పాటును అందిస్తామని చెప్పారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ర్యాలీ.. ప్రతిజ్ఞ

చేనేత వారోత్సవాలను పురస్కరించుకుని చేనేత, జౌళిశాఖ అధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక కృష్ణవేణి చౌరస్తా నుంచి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ కొనసాగింది. కలెక్టర్‌తో పాటు అధికారులు, చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్ని చేనేత కార్మికులను ఉత్సాహ పరిచారు. అనంతరం చేనేత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో వృత్తి నైపుణ్యాలు కనబర్చిన 37 మంది చేనేత కార్మికులకు ప్రశంసా పత్రం అందజేసి, శాలువాతో సన్మానించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. చేనేత మిత్ర పథకం ద్వారా మంజూరైన చెక్కులను చేనేత కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్లు అపూర్వ్ చౌహాన్, చీర్ల శ్రీనివాస్, చేనేత శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ షో రిహార్సల్

మినీ ట్యాంక్‌బండ్ వద్ద లేజర్ షో కోసం సిద్ధం చేసిన డ్రోన్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద శనివారం రాత్రి 8 నుంచి 8.15 గంటల వరకు 15 నిమిషాల పాటు డ్రోన్ల ద్వారా లేజర్ షో రిహార్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశంలో సీఎం కేసీఆర్, వివిధ సంక్షేమ పథకాలు, రాష్ట్రంలోని ముఖ్య పర్యాటక ప్రాంతాలకు చెందిన వివిధ చిత్రాలు కనిపించాయి. వీటిని స్థానికులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కాగా, ఆదివారం సాయంత్రం 7 నుంచి 7.15 గంటల వరకు నిర్వహించే ప్రధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్ఆర్ఓ వెంకటేశ్వర్లు కోరారు. మొట్టమొదటిసారిగా 450 డ్రోన్లతో ఇచ్చే ప్రదర్శనకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

గద్వాల అర్బన్: అఖిల భారత విద్యార్థి ఫేడరేషన్ 87వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక కార్యాలయం వద్ద ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పరేష్ బాబు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 1936ఆగస్టు 12న జవహార్ లాల్ నెహ్రూ నాయకత్వంలో లక్నోనగర్ బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావించిందని, ఆనాటి నుంచి విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. కుట్రలు, మతవిద్వేష రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహేష్, మురళీ, రంగన్న, పాష, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాక్షుడు నరేష్, నాయకులు వీరేష్, హనుమంతు తదితరులు ఉన్నారు.



అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఆరోపణలు

- ఎమ్మెల్యే అబ్రహం
- వెంకటాపురం – చిన్నధన్వాడ బీటీ రోడ్డు పనులకు భూమిపూజ



బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

శాంతినగర్: రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామ సమీపంలో బీటీ రోడ్డు రెన్యూవల్ పనులకు ఎమ్మెల్యే శనివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా వున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కడతారనే నెపంతో ప్రతిపక్ష పార్టీలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎన్ని ఆరోపణలు చేసినా బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. వెంకటాపురం నుంచి చిన్నధన్వాడ వరకు వున్న బీటీ రోడ్డు గుంతలమయమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకుని రూ.4.30 కోట్లు మంజూరుచేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. ప్రతి గ్రామ పంచాయతీకి మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. బీటీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో బాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అక్రమ నిర్బంధాలకు భయపడం



అలంపూర్ చౌరస్తాలో నిరసన ర్యాలీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: అక్రమ నిర్బంధాలు, అక్రమ కేసులకు బీఎస్పీ భయపడదని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కృష్ణ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ పార్టీ అధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గృహ నిర్బంధానికి వ్యతిరేకంగా శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు క్యాంపు కార్యాలయం నుంచి జాతీయరహదారి సర్వీస్ రోడ్డు కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కూడలిని దిగ్బంధించి తమ నిరసన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లను దిగ్బంధించడంతో కొంత సేపు ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మాట్లాడుతూ...ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గృహనిర్బంధం చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలను నాశనం చేసిందని, వారి తప్పులను కప్పిపుచ్చుకోవడానికి తీవ్రమైన ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకు వెంట వెంటనే పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. పరీక్ష వాయిదా వేయాలని శాంతియుత దీక్ష చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ని గృహ నిర్బంధన చేయడం సరైంది కాదన్నారు. విద్యార్థుల కోసం బీఎస్పీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. గ్రూప్–2 పరీక్షను 3నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కనకం బాబు, ప్రభుదాస్, సురేష్, నాగరాజు, లక్ష్మన్న, జలెందర్, వెంకటేష్, మహేష్, రాజు, యువరాజ్, మనోజ్, నాని, శరత్, వసంత్ మహిళా నాయకురాలు నాగజ్యోతి, కో–కన్వీనర్ శోభ గౌడ్, మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

కోస్గి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ వివరాల ప్రకారం కొన్ని రోజుల నుంచి భార్గవి(20) కుటుంబంలో కలహాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఆమె మనస్థాపానికి గురై ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పురుగుమందు తాగి యువతి..


గీతా (ఫైల్)

చారకొండ: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని తుర్కలపల్లి పంచాయతీ పరిధిలోని బొమ్మలగుడిసేలులో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మలగుడిసేలు గ్రామానికి చెందిన కప్పెర గీతా(18)ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఉరేసుకుని యువకుడు..


సూర్యకిరణ్ (ఫైల్)

ఊట్కూర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నిడుగుర్తిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా.. ముక్కిడి ఆశప్పకు నలుగురు కుమారులు ఉన్నారు. ఉదయం ఇంట్లో అన్నదమ్ముల మధ్య గొడవలు కావడంతో చిన్న కుమారుడు సూర్యకిరణ్ (24) పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐ గోకరిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బోర్లపడి వ్యక్తి మృతి


అయిలయ్య (ఫైల్)

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవి వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నాయిని అయిలయ్య (45) నివాసం వద్ద మంచం కోలుకు కాలు తగిలి బోర్ల పడ్డాడు. ముక్కుకు తవ్రగాయమై రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అక్కపై పెట్రోల్ పోసి నిప్పంటించిన చెల్లెలు

మహబూబ్‌నగర్ క్రైం: తన భర్తతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని సొంత అక్కపై పెట్రోల్ పోసి తగలపెట్టిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే గుల్‌నాజ్ బేగంకు 13 ఏళ్ల కిందట పెళ్లి జరగగా.. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె బీడీలు చూడుతూ జీవనం సాగిస్తుంటుంది. అయితే ఆమె సొంత చెల్లెలు సైనాజ్ బేగం భర్త సాదిక్‌తో గుల్‌నాజ్ బేగం కొంతకాలంగా అక్రమ సంబంధం పెట్టుకుంది. దీంతో ఎలాగైనా అక్కను హత్యచేయాలని భావించిన చెల్లి.. ప్లాస్టిక్ బాటిల్‌లో పెట్రోల్ తీసుకొచ్చి ఆమెపై పోసి నిప్పు అంటించింది. మంటలకు తట్టుకోలేక ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు గమనించి చికిత్స కోసం జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు గుల్‌నాజ్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగనోట్ల చలామణి నిగ్గు తేలేనా?

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలో దొంగనోట్ల దందా దర్జాగా సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు రోజులుగా సాక్షి దినపత్రికలో దొంగనోట్ల వ్యవహారంపై వార్తలు రావడంతో పేరు చెప్పడానికి ఇష్టపడని వారు చాలా సమాచారం అందిస్తున్నారు. ఓ వ్యాపారిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. తెల్లబట్టలు ధరించి తిరిగే ఆ వ్యాపారి రూ.2వేల నోట్లు గతంలో ఓ బ్యాంకులో వేయగా అందులో నకిలీ నోట్లను గుర్తించి బ్యాంకు సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారని విశ్వసనీయ సమాచారం. దొంగనోట్ల వ్యవహారంలో పెద్ద పెద్ద వారికి ఎలాంటి ఇబ్బంది ఉండదని సామాన్య, పేద, మధ్య తరగతి వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు కలగజేస్తున్నాయని ఆందోళన వ్యక్తం అవుతుంది. సమగ్ర విచారణ చేసి దొంగనోట్ల చలామణికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

అభాగ్యులపై వాత్సల్యం

విధి వంచిత బాలలకు భరోసా

- అనాథ చిన్నారులకు చేయూతనిస్తున్న గద్వాల బాలసదన్
- మంచి విద్యాబుద్ధుల తోపాటు వసతుల ఏర్పాటు
- ఇప్పటికే గురుకుల, పాలిటెక్నిక్ కళాశాలల్లో పలువురికి సీట్లు
- అత్యుత్తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నట్లు కితాబు

చిన్నతనంలోనే కన్నవారిని కోల్పోయి అనాథలుగా మారినవారు.. ఇతర కారణాలతో నిరాశ్రయులైన అభాగ్యులపై ప్రభుత్వం 'వాత్సల్యం' చూపిస్తోంది. విధి వంచిత బాలలకు అండగా నిలిచేందుకు ప్రత్యేక పథకం ప్రవేశపెట్టింది. 'మిషన్ వాత్సల్య' పేరుతో సమగ్ర బాలల రక్షణ పథకాన్ని తీసుకొచ్చి.. ఎలాంటి ఆదరణ లేక, అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతనందిస్తుంది. తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు, అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), విడాకులు పొందిన తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలు, కటుంబాలు వదిలేసిన పిల్లలు, బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు.. తదితరుల కోసం తీసుకొచ్చిన 'వాత్సల్య' పథకాన్ని జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని బాలసదన్ సమర్థవంతంగా అమలు చేస్తూ అందరి చేత ప్రశంసలు పొందుతుంది.

– సాక్షి డెస్క్, మహబూబ్‌నగర్/రాజోళి



గద్వాలలోని బాలసదన్

సండే స్పెషల్

జోగుళాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా ఉన్న అనాథ పిల్లలు, బాల కార్మికులుగా పనిచేస్తున్న వారిని గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ద్వారా వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. గుర్తించిన పిల్లల వయసును బట్టి వారిని బాలల కేంద్రాల్లో ఉంచుతారు. 0– 6 సంవత్సరాలున్న పిల్లలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మహబూబ్‌నగర్‌లోని శిశుగృహలో, 6–18 ఏళ్ల వయసున్న వారిని గద్వాల జిల్లాకేంద్రంలోని బాలసదన్‌లో ఉంచుతారు. వీరిలో చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన వారిని, వదిలివేయబడిన పుట్టిన శిశువులను, బాల కార్మికులు, అనాథ పిల్లలు, భిక్షాటన చేసేవారిని గుర్తించి ఆయా కేంద్రాలకు తరలిస్తారు.

ప్రత్యేక నిఘాతో..

గ్రామాల్లో దీన స్థితిని ఎదుర్కొంటున్న పిల్లలను గుర్తించేందుకు బాలల రక్షణ విభాగం ప్రత్యేక నిఘా ద్వారా పనిచేస్తుంది. ఇందుకోసం అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి.. పిల్లలను గుర్తించడంలో ముందుకు వెళ్తుంది. 1098 ద్వారా సమాచారం తీసుకుని పక్కా ప్రణాళికతో బాలకార్మికులు, పొలం పనులు, భిక్షాటన చేసేవారిని గుర్తించి కేంద్రాలకు తీసుకెళ్తారు. వారికి భోజనం, ఇతర వసతులు కల్పించి కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు సేకరిస్తారు. ఎవరైనా బంధువులు ఆసక్తి చూపితే వారి ఇళ్లకు పంపుతారు. వెళ్లిన వారిని బాగోగులు చూసుకునే క్రమంలో తరుచుగా పిల్లల చదువు విషయమై వారి ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహిస్తారు.

❐ **గు**ర్తించిన అనాథలను బాలసదన్‌లో చేర్పించిన అనంతరం అక్కడి నుంచే పాఠశాలలకు పంపి వారికి విద్యాబుద్ధులు అందిస్తారు. జిల్లాకు సంబంధించిన వారిలో మహబూబ్‌నగర్‌లోని శిశుగృహలో ఆరుగురు పిల్లలను చేర్పగా.. గద్వాల జిల్లాకేంద్రంలోని బాలసదన్‌లో ఈ ఏడాది 30 మంది పిల్లలను చేర్పించారు. కాగా.. అలా చేరిన వారిలో 2023లోనే గురుకులాల్లో 15 మందికి, పాలిటెక్నిక్ కళాశాలల్లో 13 మందికి సీట్లు వచ్చాయి. గతేడాది గురుకులాలు, కేజీబీవీల్లో 33 మందికి సీట్లు లభించగా.. పాలిటెక్నిక్‌లో 9 సీట్లు వచ్చాయి. పలు గురుకులాల పాఠశాలల్లో చేరిన విద్యార్థులతో పాటు ప్రస్తుతం హైదరాబాద్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు వచ్చేలా చేసినా సంబంధిత అధికారుల కృషికి జిల్లా ప్రజలు అభినందనలు చెబుతున్నారు. ఆ విద్యార్థులకు తరుచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వారిపై వారికి నమ్మకం కలిగేలా చైతన్యపరచడం ద్వారానే ఫలితాలు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం బాలసదన్‌లో ఉన్నవారంతా 15 ఏళ్లలోపు వారే కావడం.. ఉన్న 30 మంది కూడా బాలికలే కావడం విశేషం. పదేళ్లలోపు బాలురు వచ్చినట్లయితే అక్కడే ఉంచుతామని, ఆపైబడిన వారైతే ఎర్రవల్లిలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో చేర్పుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

2018 నుంచి విస్తృతంగా..

గతంలో ఉమ్మడి జిల్లావారిగా ఉన్న మహిళా శిశు సంరక్షణ కేంద్రాలతోనే పిల్లలను చేరదీసేవారు. కానీ, 2018 నుంచి జిల్లాల వారీగా అప్పటికే ఉన్న కేంద్రాలతో పాటు కొత్త జిల్లాలకు అదనంగా బాలసదన్ ఏర్పాటు చేయడంతో వాటి సేవలు విస్తృతంగా పెరిగాయి. బాలసదన్‌లో ఒక సూపరింటెండెంట్, ఒక వెల్ఫేర్ ఆఫీసర్, ఒక కౌన్సిలర్, ఒక వంట మనిషి, దోబీ ఉంటారు. వీరితో పాటు జిల్లా వెల్ఫేర్ అధికారి పర్యవేక్షిస్తారు. విద్యార్థులను కేవలం పాఠశాలలకే పరిమితం చేయకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీల్లోనూ తర్ఫీదు ఇవ్వడంతో వారు మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా తయారవుతున్నారు. ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు దీటుగా తామేం దులోనూ తీసిపోమని ఆటాపాటల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ క్రమంలో గడిచిన గణతంత్ర వేడుకల్లో వారి ప్రతిభకు మెచ్చి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంత్రి సత్యవతి రాథోడ్ అభినందించారు. వారు చదువుతున్న పాఠశాల స్థాయిలో సైతం అన్నిరంగాల్లో మంచి ఫలితాలు కనబరుస్తున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.


అప్పటి అదనపు కలెక్టర్ శ్రీహర్షకు రాఖీ కడుతున్న బాలసదన్ బాలికలు (ఫైల్)

ప్రత్యేక కార్యాచరణతో..



అనాథ పిల్లలు, బాలకార్మికులు లేని సమాజం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. మిషన్ వాత్సల్య ద్వారా జిల్లాలో ఎంతోమంది పిల్లలను బాలసదన్‌కు పంపి.. వారికి చదువు చెప్పించి.. కళాశాలలకు పంపుతున్నాం. దీనికోసం జిల్లాలో అంగన్‌వాడీ, 1098 ద్వారా సేవలు వినియోగించుకుంటున్నాం. అలాంటి పిల్లలు ఎక్కడున్నా మాకు సమాచారం ఇచ్చి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలి.

– ముసాహిదాబేగం, జిల్లా వెల్ఫేర్ అధికారి, జోగుళాంబ గద్వాల

బంగారు భవిష్యత్..



బాలసదన్ ద్వారా పిల్లలకు అందుతున్న సేవలు గర్వించదగ్గవి. గతంలో చాలా మంది పిల్లల జీవితాలు మొగ్గలోనే తుంచివేయబడ్డాయి. తల్లిదండ్రులు లేక కొందరు, బాలకార్మికులుగా కొందరు, బాల్య వివాహాలు చేసుకుని మరికొందరు తమ భవిష్యత్‌ను అంధకారంలోనే అనుభవించారు. ప్రస్తుతం బాలసదన్ ద్వారా పిల్లలకు బంగారు భవిష్యత్ లభిస్తుంది. ప్రత్యేకంగా బాలికలైతే తమలో ఉన్న ప్రతిభను చూపి ఉన్నత విద్యను అభ్యశిస్తున్నారు.

– మరియమ్మ, ఎంపీపీ, రాజోళి మండలం

అవగాహన కార్యక్రమాల్లో..



బాల కార్మికులు, బాల్య వివాహాలపై గ్రామాల్లో జరిగే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటాం. వాళ్లు చెప్పే అంశాల ద్వారా మా పరిధిలో పిల్లల పట్ల జరిగే వివక్ష, బాలకార్మికులపై మీడియా వారికి సమాచారం ఇస్తుంటాం. ఇలాంటి సమాచారాల ద్వారానే పిల్లల భవిష్యత్ బాలసదన్, విద్యాలయాల్లో బంగారుమయం అవుతుందని తెలిసి చాలా సంతోషపడ్డాం.

– శ్రీనివాస్‌గౌడ్, శాంతినగర్



బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాలసదన్ విద్యార్థులు (ఫైల్)



మంత్రులు సత్యవతి రాథోడ్, తలసాని చేతులమీదుగా ప్రశంసలు అందుకుంటున్న బాలసదన్ విద్యార్థులు (ఫైల్)

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

ఊర్కొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ప్రజాహిత పాదయాత్రలో భాగంగా శనివారం ఆయన మండలంలోని జగబోయిన్‌పల్లి, రాంరెడ్డిపల్లి, బొమ్మరాసిపల్లి, ఠాగూర్‌తండా, మఠంతండా, జకినాలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదని, సంక్షేమ పథకాలు ప్రారంభించే వరకు మాత్రమే కానీ, ఆచరణలో లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కొత్త పథకాల పేరుతో బీఆర్ఎస్ నాయకులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు శ్రమించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వీరస్వామి, గోపినాయక్ పాల్గొన్నారు.


జగబోయినపల్లిలో ర్యాలీగా వస్తున్న అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు



లేగదూడకు బారసాల

దేవరకద్ర: కౌకుంట్ల గోశాలలో శనివారం రాత్రి లేగదూడకు బారసాల నిర్వహించారు. గోశాలలోని ఓ ఆవు నాలుగు రోజుల కిందట లేగదూడకు జన్మించింది. ఇంట్లో శిశువులకు నిర్వహించినట్లుగానే ఊయలలో లేగదూడను ఉంచి గోదా అని నామకరణం చేశారు. గోవులను కాపాడేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గోశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు శివాచారి, శివానందచారి, అర్చకులు వెంకటేశ్వర్లు, పలువురు మహిళలు, పిల్లలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కలుపు తీసి.. తల్లిదండ్రులకు తోడుగా నిలిచి

ధరూర్‌కు చెందిన ఆంజనేయులు కౌలు రైతు. ధరూరు నుంచి గద్వాలకు వెళ్లే దారిలో కేశవరెడ్డికి చెందిన రెండెకరాల వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. ఎకరం పొలంలో పత్తి పంట సాగు చేసుకున్నాడు. మరో ఎకరం పొలంలో మిరప పంట సాగు చేసుకున్నాడు. పత్తి మొగ్గలు సరిగా రాకపోవడంతో ఇటీవల విత్తుకున్న మిరప పంట గడ్డిలో కలిసిపోయింది. ప్రస్తుతం వరి నాట్ల సీజన్ కావడంతో కూలీ రేట్లు పెరిగిపోయాయి. దీంతో రైతు తన భార్యతో కలిసి కలుపు తీసుకుంటున్నాడు. రెండో శనివారం పాఠశాలలకు సెలువు కావడంతో పిల్లలందరూ వచ్చి పొలం పనులు చేస్తూ.. తల్లిదండ్రులకు ఆసరా అయ్యారు. తల్లిదండ్రులు తీసిన కలుపు మొక్కలను గంపలో ఎత్తి బయట పారబోశారు. ఈ చిత్రం 'సాక్షి' కంటపడింది.

– ధరూరు (జోగుళాంబ గద్వాల)



జూరాలకు నిలకడగా ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో నిలకడగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. నీటి ప్రవాహం ఎక్కువగా లేకపోవడంతో విద్యుదుత్పత్తి చేపట్టలేదని ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆవిరి రూపంలో 113, నెట్టెంపాడు ఒక పంపు ద్వారా 750, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870, కుడి కాల్వ ద్వారా 750, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్టు –2కు 750 క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు స్వల్పంగా వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 12,731క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 15వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా, 122.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 32.60 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

ప్రాజెక్టుకు 12వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 13వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో 864.3 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 864.3 అడుగుల నీటిమట్టం, 119.7 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం 6గంటలకు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 12,713 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు వదులుతున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు ద్వారా 6,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 7.975 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 15,336 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 316 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

కోయిల్‌సాగర్‌లో 27.2 అడుగులు..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శనివారం సాయంత్రం వరకు 27.2 అడుగులకు నీటి మట్టం చేరింది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక పంపును రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని కోయిల్‌సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఒక పక్క జూరాల నుంచి కృష్ణా జలాలు వస్తుండగా మరో పక్క ప్రాజెక్టు కుడి ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. వానాకాలం సీజన్ కింద వేసిన వరి పంటలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ కింద దేవరకద్ర, కౌకుంట్ల మండలాలు ఉండగా, కుడి కాల్వ కింద చిన్నచింతకుంట, ధన్వాడ, మరికల్ మండలాలు ఉన్నాయి. పాత ఆయకట్టు కింద 12వేల ఎకరాలు ఉండగా, కొత్త ఆయకట్టు కింద 38,250 ఎకరాలు ఉంది. మొత్తం 50,250 ఎకరాల సాగు లక్ష్యంగా ఉంది. వానాకాలం సీజన్‌లో అధికారుల అంచనా ప్రకారం దాదాపు 35వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉంది.

సిద్దిపేటలో జురాసిక్ పార్క్



వందల ఏళ్ల కిందట అంతరించిపోయిన డైనోసార్లకు హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ వెండితెరపై రూపం ఇచ్చి ప్రాణం పోశారు. 1993లో వచ్చిన జురాసిక్ పార్క్ క్రియేట్ చేసిన ట్రెండ్ అంతా ఇంతా కాదు. ఆ తరువాత కూడా ఆ చిత్రానికి కొనసాగింపుగా అనేక సినిమాలు వచ్చి ప్రేక్షకాదరణ పొందాయి. ప్రజలకు డైనోసార్లపై ఉన్న ఆసక్తిని గమనించి ఆ తర్వాత డైనోసార్ థీమ్‌తో ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాల్లో పార్కులు వెలిశాయి. నూతన సాంకేతికతను ఉపయోగించి నిజంగా ప్రాణం పోసుకున్నాయా అన్నట్టుగా డైనోసార్లను తయారుచేసి ప్రదర్శించారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటైన రీతిలో ఇప్పుడు కొత్తగా డైనోపార్క్ మన తెలంగాణలోనూ అందుబాటులోకి రాబోతుంది. దానికి సిద్దిపేట వేదిక కాబోతుంది.

సాక్షి, సిద్దిపేట

డైనోపార్క్ నిర్మాణానికి రూ.12 కోట్ల వ్యయం

సందర్శకుల కోసం ఓపెన్ ట్రైన్ సౌకర్యం

వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు

విదేశాల్లోని పార్కుల తరహాలో

డైనోపార్క్ అంటే ఏదో ఎగ్జిబిషన్‌లా బొమ్మలు, 3డీ యానిమేషన్ స్క్రీన్లు కాదు. అమెరికా, సింగపూర్‌లలోని యూనివర్సల్ వరల్డ్ స్టూడియోలో ఉన్న డైనోపార్క్‌ల తరహాలో కోమటిచెరువు సమీపంలో పార్క్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ పార్క్ పనులు ఏడాది కిందట మొదలు కాగా ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. వారంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

1.5 ఎకరాల విస్తీర్ణంలో..

డైనోసార్ పార్క్‌ను 1.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.12 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ డైనో పార్క్‌లో పెద్ద గుహలు, కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతం, లావా, గ్రీనరీ, వాటర్‌ఫాల్స్ ఇలా మూడు వేల శతాబ్దాల కిందట భూమండలం మీద పరిస్థితులు ఎలా ఉండేవో కళ్లకు కట్టినట్టుగా ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో వివిధ రకాల డైనోసార్‌లు, వాటి గుడ్లు, అస్థిపంజరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సిలికాన్ డైనోసార్లను ఇక్కడ అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి పార్కు ఆవరణలో అటూ ఇటూ కలియతిరుగుతూ భీకరంగా శబ్దాలు చేస్తూ సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేందుకు సిద్ధమవుతున్నాయి.

వాకింగ్ డైనో..

ఈ డైనో థీమ్ పార్క్‌లో వాకింగ్ డైనోసార్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో చిన్నారులు కూర్చుంటే నడుచుకుంటూ వెళ్తుంది. ఒకేసారి ఆరుగురు చిన్నారులు కూర్చునే విధంగా రూపొందించారు. అలాగే లోపల గుహల్లో తిరుగుతున్న సమయంలో సెల్ఫీ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. డైనోసార్ గుడ్డులో నుంచి పిల్ల బయటకు వస్తుండగా సెల్ఫీ తీసుకునే అవకాశం ఉంటుంది. పార్క్‌ను చూసేందుకు వస్తున్న పిల్లలను అలరించేందుకు డైనోసార్ సూట్ వేసుకుని ఇద్దరు తిరగనున్నారు.

మినీ ట్రాక్.. ఓపెన్ ట్రైన్

డైనోసార్ పార్కులో ఉన్న వింతలు విశేషాలను చూసేందుకు వీలుగా 240 మీటర్ల నిడివితో మినీ ట్రాక్‌ను నిర్మించారు. దీనిపై ఓపెన్‌ట్రైన్ నడుస్తుంది. ఈ ట్రైన్‌లో 3 బోగీలు ఉండగా ఒక్కో బోగీలో ఆరుగురు కూర్చునే వీలుంది. ఈ ఓపెన్ ట్రైన్‌లో తిరుగుతున్న సమయంలో సందర్శకులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేలా ఒక్కసారిగా డైనోసార్‌లు మీదపడినట్టు, భీకరంగా అరవడం లాంటివి చేసేలా పార్క్‌ను డిజైన్ చేశారు.

గుజరాత్‌ను మించేలా..

మన దేశంలో గుజరాత్‌లోని రయోలిలో డైనోసార్ గుడ్లు లభించాయి. దీంతో అక్కడ డైనోసార్ మ్యూజియం ఏర్పాటు చేశారు. ఈ మ్యూజియంలో నిలకడగా ఉండే డైనోసార్‌లను ప్రదర్శనకు ఉంచారు. డైనోసార్లలో ఒక్కటి మాత్రమే అరుస్తూ.. తోక ఊపుతుంది. కానీ సిద్దిపేటలో ప్రారంభంకాబోతున్న పార్క్‌లో కదిలే డైనోసార్లు 18 ఉన్నాయి. ఇవికాకుండా మరో ఐదు నిలకడగా ఉండేవి ఏర్పాటు చేశారు. ఒక రకంగా దేశంలో ఇదే అత్యుత్తమ, అత్యంత పెద్ద డైనోసార్ పార్క్ అని అంటున్నారు.



డైనోపార్క్‌లో గుహలు, డైనోసార్‌లు

కొత్త అనుభూతి కలిగిస్తుంది



కోమటి చెరువులో మరో మణిహారంగా డైనోసార్ పార్క్ ఏర్పాటు కాబోతుంది. ఇప్పటికే రాక్‌గార్డెన్, గ్లో గార్డెన్, అడ్వెంచర్ పార్క్‌ల చెంతన వినూత్నమైన రీతిలో కొత్త అనుభూతిని కలిగించేలా డైనోసార్ పార్క్ అందుబాటులోకి రానుంది. సాహస అనుభవాలని, జ్ఞాపకాలని, మధురానుభూతిని కలిగించేలా డైనోసార్ పార్కు ఉంటుంది. దేశంలో ఎక్కడాలేని విధంగా సిద్దిపేటలో ఈ పార్క్ ఉండబోతుంది.

–హరీశ్‌రావు, రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి

అయ్యో.. ఆరేళ్లకే నూరేళ్లు!

- తిరుమల కొండపై బాలికను చంపేసిన వన్యమృగం
- అలిపిరి నడక మార్గంలో శుక్రవారం రాత్రి చిన్నారి అదృశ్యం
- అటవీ ప్రాంతంలో శనివారం మృతదేహం లభ్యం
- చిరుతా, ఎలుగుబంటా అనేది అనుమానం



చిన్నారి లక్షిత (ఫైల్ ఫొటో)



కుమార్తె లక్షిత మృతితో విలపిస్తున్న తల్లి శశికళ

తిరుమల/కోవూరు: తిరుమల కొండపై తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలిపిరి నడకదారిలో శుక్రవారం రాత్రి ఆరేళ్ల చిన్నారి నడుస్తుండగా అకస్మాత్తుగా ఓ వన్యమృగం చేసిన దాడిలో మృత్యువాత పడింది. నరసింహస్వామి ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం, పోతిరెడ్డిపాళేనికి చెందిన దినేష్‌కుమార్, శశికళ కుమార్తె లక్షిత (6) కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం తిరుపతికి చేరుకున్నారు. మ.3.30 గంటల ప్రాంతంలో వారంతా అలిపిరి నడకమార్గం ద్వారా తిరుమలకు కాలినడకన బయల్దేరారు. రాత్రి 7.30 గంటల సమయంలో బాలిక నరసింహస్వామి ఆలయం సమీపంలో అదృశ్యమైంది. తల్లిదండ్రుల కంటే ముందుగానే ఆ చిన్నారి నడుస్తుండడంతో వేరే భక్తుల గుంపులో కలిసి వెళ్లి ఉంటుందని తల్లిదండ్రులు తొలుత భావించి వెతకడం ప్రారంభించారు. ఎంతకూ కనపడకపోవడంతో చివరికి అక్కడున్న భద్రతా సిబ్బందికి తెలిపారు. రాత్రి 10.30కు తిరుమల టూటౌన్ పోలీసులకు బాలిక అదృశ్యంపై ఫిర్యాదు అందింది. దీంతో తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. రాత్రి నుంచి దాదాపు 70 మంది టీటీడీ, అటవీశాఖ సిబ్బంది, పోలీసులు గాలింపు చేపట్టారు. శనివారం ఉ.6 గంటల ప్రాంతంలో నరసింహస్వామి ఆలయం సమీపంలోని నడకదారి నుంచి 150 మీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో బాలిక మృతదేహాన్ని గుర్తించారు. పూర్తిగా ముఖాన్ని జంతువు తినడంతోపాటు, కాలిని తీవ్రంగా గాయపర్చింది. దీంతో బాలిక అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలుస్తోంది. చిరుత లేదా ఎలుగుబంటి దాడిచేసి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఘటన తీవ్రంగా కలిచివేసింది : ఈఓ ధర్మారెడ్డి

చిన్నారి మృతి తమను తీవ్రంగా కలిచివేసిందని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించి మీడియాతో మాట్లాడారు. మృతురాలి కుటుంబానికి టీటీడీ నుంచి రూ.5 లక్షలు, అటవీశాఖ నుంచి రూ.5 లక్షలు అందిస్తామని చెప్పారు. బాలిక ఒంటరిగా వెళ్లడాన్ని సీసీ కెమెరాల్లో గుర్తించామన్నారు. బాలిక నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారి నుంచి పక్కకు అటవీ ప్రాంతంలోకి ఆడుకుంటూ వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఎందుకంటే.. బాలిక ఆటవస్తువులు అటవీ ప్రాంతంలోనే దొరికాయని తెలిపారు. ఈ సమయంలో వన్యమృగం దాడిచేసి తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు.

భద్రత విషయంలో రాజీలేదు : భూమన

ఇక తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తేలేదని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టంచేశారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులపై శనివారం సాయంత్రం అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం బాలిక లక్షిత మృతదేహం లభించిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ఘటనలో ఎవరి నిర్లక్ష్యంలేదని ఆయన మీడియాతో అన్నారు.

అధికారులతో అత్యవసర సమావేశం

మరోవైపు.. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో మరింత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ, అటవీ పోలీస్ అధికారులతో జరిపిన అత్యవసర సమావేశంలో ఈఓ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్ఓను ఆయన ఆదేశించారు. అలాగే, వన్యమృగాన్ని బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీ 100 మంది భక్తుల గుంపునకు సెక్యూరిటీ సిబ్బంది ఏర్పాటుకు అనుమతించనున్నట్లు చెప్పారు. అలాగే, నడకదారుల్లో మ.2–3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశాలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. చిన్నపిల్లలతో నడకమార్గాల్లో వచ్చే తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఈఓ విజ్ఞప్తి చేశారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, బోన్ల సాయంతో నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధిస్తామన్నారు.



తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు పండితులు వేద ఆశీర్వాదం చేశారు. అలాగే ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రంగస్వామి నటరాజ్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరం

- బ్రాహ్మణ పరిషత్ ఉద్యోగులకు అందని జీతాలు
- ప్రభుత్వ సలహాదారు రమణాచారి వ్యాఖ్యలు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా వాస్తవమని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని ఓ హోటల్లో జరిగిన జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో కేవీ రమణాచారి మాట్లాడుతూ.. తాను అధ్యక్షత వహిస్తున్న బ్రాహ్మణ పరిషత్‌లోని ఉద్యోగులకు ఈనెల ఇంకా జీతాలు విడుదల కాలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు మూడు నెలలుగా పెన్షన్లు రావడం లేదని, డబుల్ బెడ్‌రూమ్‌లు వచ్చేలా చొరవ చూపాలని కోరిన తెలంగాణ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర స్థాయి నేతలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిరసనలు, డిమాండ్ల ద్వారానే ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకెళ్లాలని వారికి సూచించారు. అంతకుముందు ఇటీవల మరణించిన గద్దర్, సాయిచంద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జట్‌ప్రోల్‌లో సినిమా షూటింగ్

పెంట్లవెల్లి: జట్‌ప్రోల్ వేణుగోపాల స్వామి ఆలయంలో హీరో సుమన్, హీరోయిన్ గరీమా చౌహాన్ జంటగా నటిస్తున్న 'సీతాకల్యాణ వైభోగమే' సినిమాను చివరి షెడ్యుల్‌గా శనివారం గ్రామ సమీపంలోని నల్లమల ప్రాంతంలో కృష్ణానది తీరంలో పలు సీన్లను చిత్రీకరించారు. అదేవిధంగా నటులు శివాజీరాజా, హీరో సుమన్‌ల మధ్య పలు సన్నివేశాలను జట్‌పోల్‌లో నిర్వహించారు. నల్లమల అటవీ ప్రాంతంలో మాస్టర్ డ్రాగన్ ఫైటర్ ప్రకాష్ ఆధ్వర్యంలో 100 మంది ఫైటర్లతో సీన్లు చిత్రీకరిస్తున్నామని దర్శకుడు సతీష్ పరమవీరా తెలిపారు. సినిమా షుటింగ్ విషయం తెలియడంతో పలు గ్రామాల ప్రజలు భారీగా షుటింగ్ ప్రాంతానికి తరలివచ్చారు.



గండి పూడ్చివేత పునఃప్రారంభం

- ఆందోళనలో చిన్నోనిపల్లి భూ నిర్వాసితులు
- అడ్డుకుంటే చర్యలు తప్పవంటూ పోలీసుల హెచ్చరికలు



చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో నిలిచిన వర్షపు నీరు

గట్టు: చిన్నోనిపల్లి రిజర్వాయర్ కట్ట గండిని పూడ్చే పనులు పునః ప్రారంభమయ్యాయి. సుమారు రెండునెలల విరామం తర్వాత అధికార యంత్రాంగం పనులు ప్రారంభించడంతో నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి రెండువైపుల ఉన్న రెండు వాగుల నుంచి వచ్చే వర్షపు నీరు ఈ గండి నుంచే బయటకు వెళ్లేవి. అయితే నిర్వాసితులు ప్రతిఘటించే అవకాశం ఉన్నందున మార్చిలో భారీ పోలీసు బలగాల పర్యవేక్షణలో గండిని పూడ్చే పనులు ప్రారంభించారు. కొన్నిరోజుల పాటు పనులు కొనసాగినా.. మే నెలలో నిర్వాసితులు పనులు అడ్డుకోవడంతో నిలిపి వేశారు. వర్షాకాలం ప్రారంభంలో కురిసిన వర్షాలకు గ్రామానికి రెండు వైపులా ఉన్న వాగుల నుంచి వచ్చిన నీరు రిజర్వాయర్ నుంచి బయటకు వెళ్లకుండా నిలిచిపోవడంతో అప్పట్లోనే నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గండిని పూడ్చితే వాగుల నుంచి వచ్చే నీరు రిజర్వాయర్‌లో నిలిచి ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇళ్లలోకి చేరే అవకాశం ఉందని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రంలో సరైన సౌకర్యాలు కల్పించకుండా.. పాత ఊరు ఖాళీ చేయకుండానే గండిని పూర్తిస్థాయిలో మూసివేస్తే మేం ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. పనులు పునః ప్రారంభమైన నేపథ్యంలో పోలీసులు గ్రామానికి చేరుకొని పనులు అడ్డుకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే చిన్నోనిపల్లె, ఇందువాసి గ్రామాలకు చెందిన ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసినందున నిర్వాసిత కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయి.

రేపట్నుంచి అయిత చండీ అతిరుద్రం

జడ్చర్లలో ఈ నెల 27వ తేదీ వరకు మహాయాగం

- శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహణ



సిద్ధమవుతున్న యాగశాల మండపం

జడ్చర్ల: ప్రకృతి సమతుల్యత, విశ్వశాంతి, సమస్త మానవాళి, జీవరాసుల మనుగడ, సమస్త కర్మములు, పాపదోషాల నివారణకు ఈ నెల 14 నుంచి 27 వరకు జడ్చర్లలో అయిత చండీ అతిరుద్రం 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం నిర్వహిస్తున్నారు. స్థానిక తాలూకా క్లబ్ రోడ్ సమీపంలో ఉన్న విశాల మైదానంలో ఈ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానందస్వామీజీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.

- అయిత చండీ అతిరుద్రం మహాయాగం నిర్వహణకు కర్రలు, తాటి ఆకులతో ప్రధాన మండపం, యాగశాల, హోమగుండాలు నిర్మిస్తున్నారు. అటు 44వ నంబర్, ఇటు 167 నంబర్ జాతీయ రహదారిపై స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని.. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మైదానాన్ని పరిశీలించి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు.



హోమగుండాల నిర్మాణం

ఇవీ కార్యక్రమాలు..

- 14న గణపతి పూజ, శుద్ధ పుణ్యాహ వాచనం, పంచగవ్య ప్రాసన, రుత్విక్ వరుణ, గోసహిత యాగశాల ప్రవేశం, అఖండజ్యోతి స్థాపన, యాగశాల స్థాపన, వాస్తుహోమం తదితర ప్రత్యేక పూజలు
- 15న మహాగణపతి, లక్ష్మీగణపతి, చండి, ఆదిలక్ష్మి హోమం, సామూహిక లక్ష గరికార్చన
- 16న ధన్వంతరి, నక్షత్ర, ధనలక్ష్మి హోమం
- 17న శ్రీలక్ష్మి, కుబేర, అష్టలక్ష్మి, ధాన్యలక్ష్మి హోమము, ఉమామహేశ్వరస్వామి కల్యాణం
- 18న విశేష చండీసహిత గజలక్ష్మి హోమం, సామూహిక విశేష లక్ష కుంకుమార్చన, లక్ష గాజులార్చన
- 19న శ్రీలక్ష్మీ నృసింహ సహిత సుదర్శన, లక్ష్మీనారాయణ, నవగ్రహ, సంతానలక్ష్మి హోమం, వేంకటేశ్వరస్వామి కల్యాణం, లక్ష బిల్వార్చన, రుద్రక్రమార్చన
- 20న సూర్య, సరస్వతి, ధైర్యలక్ష్మి హోమం, విశేష సూర్య నమస్కారం, సరస్వతి పూజలు
- 21న అమృత పాశుపతాస్త్ర మృత్యుంజయ రుద్ర, విజయలక్ష్మి హోమం, దశ సహస్ర పార్థివ లింగాలకు విశేష అభిషేకం, లక్ష బిల్వార్చన, సహస్ర జ్యోతిర్లింగార్చన
- 22న వివాహంకాని ఆడవారికి వర పాశుపతం, మగవారికి కన్యా పాశుపత, హనుమత్ సహిత సుబ్రమణ్య, విద్యాలక్ష్మి హోమం
- 23న సర్పసూక్త, సుబ్రమణ్య సమేత సంతాన వేణుగోపాల హోమం, శ్రీలక్ష్మి నృసింహ కల్యాణం
- 24న శ్రీమేధా దక్షిణామూర్తి, రామగాయత్రి సహిత చండీ హోమం, సీతారామస్వామి కళ్యాణం
- 25న చండీసహిత నవదుర్గ హోమం, సామూహిక వరలక్ష్మి వ్రతం, అమ్మవారికి శ్రీచక్ర అర్చన, పంచామృత అభిషేకం, లక్ష గాజులార్చన, కోటి కుంకుమార్చన, లక్ష పుష్పార్చన
- 26న సుదర్శన పూర్వక మహా మృత్యుంజయ, వరలక్ష్మి సమేత మహానారాయణ హోమం, సీతారాములకు విశేష అభిషేకం, సీతారామచంద్ర పాదుకా పట్టాభిషేకం, మహాసామ్రాజ్య పట్టాభిషేకం, శ్రీకృష్ణ కాలచక్ర యంత్ర లక్ష దీపోత్సవం
- 27న మహా పూర్ణాహుతి, గురుపూజ, అవభృతస్నానం, ఉట్టికొట్టుట, రాధాకృష్ణ శాంతి కల్యాణం

నటనలో రాణిస్తున్న కురుమూర్తి

- సినిమాల్లో, టీవీ షోలు, సిరియల్స్‌లో మంచి గుర్తింపు
- గుండుమూర్తిగా సుపరిచితం



యాత్ర సినిమాలో మమూటితో..

ఆత్మకూర్: క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తూ సినిమాలు, టీవీ షోలు, సిరియల్స్‌లో నటిస్తూ సినీరంగంలో గుండుమూర్తిగా మంచి గుర్తింపును సాధిస్తున్నాడు కురుమూర్తి. ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లిలో నివాసముంటున్న ఈయన వివిధ రంగాల్లో పనిచేస్తుండేవాడు. నటనపై ఉన్న మక్కువతో హైదరాబాద్ పయనమయ్యాడు. ముందుగా పోసాని కృష్ణమురళీ వద్ద చేరి రచనలో నైపుణ్యం సాధించాడు. అంతలోనే ప్రభాస్ రాఘవేంద్ర సినిమాలో నటించే అవకాశం రావడంతో దొంగ వేషధారణలో అలరించాడు. అనంతరం నాగచైతన్యతో శైలజారెడ్డి అల్లుడు, అనుష్కాతో భాగమతి, ముమ్మటితో యాత్ర, రాజయోగం, శక్తిపాలిశెట్టి సినిమాల్లో నటించి గుర్తింపును పొందాడు. సినిమాల్లో నటిస్తూనే చమ్మక్ చంద్ర, చలాకి చంటి, సత్తిపండు, సూకరాజు, సుధీర్‌లతో కలిసి జబర్దస్త్ టీవీషోలో వివిధ క్యారెక్టర్లు చేస్తు గుండుమూర్తిగా నవ్విస్తు ఎంతో గుర్తింపు పొందుతున్నాడు. అలాగే కార్తికదీపం, మనసు మమత, సీతమ్మవాకిట్లో సిరిమల్లెపువ్వు ఇతర సీరియల్స్‌లో నటించి మంచి నటుడిగా గుర్తింపు పొందాడు. సినీ ఇండస్ట్రీలో రాణిస్తుండడంతో ఆరేపల్లి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చాలా కష్టాలు పడ్డ..



సినీ, టీవీ రంగాల్లో నటుడిగా రాణించేందుకు చాలా కష్టపడ్డాను. అవకాశాల కోసం ఎన్నో నెలలపాటు స్టూడియోలు, డైరెక్టర్లు, ఆర్టిస్టుల వద్ద తిరిగాను. పస్తులతో ఎన్నో రోజులు గడిపాను. హోటల్స్‌లో, కూలి పనులు చేశాను. పోసాని కృష్ణమురళీ ద్వారా అవకాశం పొంది ప్రస్తుతం సినిమాలు, టీవీ షోల్లో నటిస్తున్నాను. నటనతోపాటు రచయితగా, డైరెక్టర్‌గా కొనసాగేవిధంగా ముందుకెళ్తున్నా.

– కురుమూర్తి, నటుడు, ఆరేపల్లి

వ్యాపారులకు నష్టపరిహారం ఇవ్వాలని నిరసన



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- ముందస్తు సమాచారం లేకుండా పోలీస్ బలగాలతో కూల్చివేత పనులు
- నాలుగు గంటల పాటు రాస్తారోకో చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

కోస్గి: భూత్పూర్– చించోలి జాతీయ రహదారి పనుల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మాణ పనులకు సంబంధించి వ్యాపారులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీస్ బలగాలతో కూల్చివేత పనులు చేపట్టడం సరికాదని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ మేరకు స్థానిక శివాజీ చౌరస్తాలో పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారిపై నాలుగు గంటల పాటు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. అభివృద్ధి పనులకు అందరూ సహకరిస్తారని, అధికారులు వ్యవహరించిన తీరు ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ నెల 2న నోటీసులు తయారు చేసి 9న రాత్రి సమయంలో వ్యాపారులకు అందించి, 10న తెల్లవారగానే జేసీబీలు, పోలీస్ బందోబస్తుతో వచ్చి కూల్చివేతలు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. వ్యాపారులకు కనీసం 15 రోజుల సమయమైన ఇచ్చి ఉంటే వారే స్వచ్ఛందంగా దుకాణాలను అవసరమైన మేర కూల్చి వేసుకునేవారని, వ్యాపారులకు నష్టం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు. అధికారులు, పోలీసులు వ్యవహరించిన తీరుతో వ్యాపారులు భయభ్రాంతులకు గురయ్యారని, అధికారులు వ్యాపారులతో చర్చించి, తగిన సమయం ఇవ్వడంతోపాటు రోడ్డు వెడల్పులో దుకాణాలు నష్టపోతున్న వ్యాపారులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు సమ్మతించడంతో వారికి వినతి అందజేసి ధర్నా విరమించారు. ఇందులో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, అన్న కిష్టప్ప, గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భాను నాయక్, నాగులపల్లి నర్సింహ, సురేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.